
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం । 10 । అక్టోబర్ । 2025



సోమశిలలో 72.47 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 72.47 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఎగువ ప్రాంతాల నుంచి 16,180 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.1,26,420
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.11,396
3 శాతం జీఎస్టీతో	రూ.11,738
నవర (8 గ్రా)	రూ.93,904

గరిష్టం/కనిష్టం
34.3 /27.1

వాతావరణం

జిల్లాలో అక్కడక్కడా వర్షం శుక్రవారం కురిసే అవకాశం ఉందని వాతావరణ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 76 శాతంగా గురువారం నమోదైంది.

న్యూస్‌రీల్

13 నుంచి ఎస్‌ఏఎంపీ - 2 పరీక్షలు

నెల్లూరు (టౌన్): జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో రెండో నిర్మాణాత్మక మదింపు (ఎస్‌ఏఎంపీ - 2) పరీక్షలను ఈ నెల 13 నుంచి నిర్వహించనున్నామని డీఈఓ బాలాజీరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి నుంచి ఐదో తరగతి చదువుతున్న విద్యార్థులకు మూడు.. ఆరు నుంచి పదో తరగతి వారికి పరీక్షలను నాలుగు రోజులు నిర్వహించనున్నామని చెప్పారు. 13న తెలుగు, గణితం.. 14న హిందీ, సామాన్య, భౌతిక శాస్త్రం.. 15న ఇంగ్లిష్, సాంఘిక శాస్త్రం.. 16న సంస్కృతం, జీవశాస్త్రం సబ్జెక్టులకు సంబంధించిన పరీక్షలను నిర్వహించనున్నామని వివరించారు. ప్రతి పాఠ్యాంశానికి 35 మార్కులతో పాటు విద్యార్థి ప్రతి స్పందనలు, రాత, ప్రాజెక్ట్ పనులకు 15 కలిపి మొత్తం 50 మార్కులకు మదింపు చేయనున్నారని చెప్పారు. సమాధానాలు రాసేందుకు గానూ విద్యార్థులకు అసెస్మెంట్ బుక్‌లెట్లను గతంలోనే ఇచ్చామని, పరీక్షల అనంతరం ఉపాధ్యాయులు మూల్యాంకనం చేసి ఆ మార్కులను ఓఎమ్మార్‌లో నమోదు చేసి స్కానింగ్ అనంతరం లీప్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయనున్నారని తెలిపారు.

సర్వేపల్లికి సీఎం చంద్రబాబు రాక నేడు

వెంకటాచలం: జిల్లాలో సీఎం చంద్రబాబు శుక్రవారం పర్యటించనున్నారు. వెంకటాచలం మండలం సర్వేపల్లి సమీపంలో నిర్మించిన విశ్వ సముద్ర బయో ఇథనాల్ ప్లాంట్‌ను సాయంత్రం 3.30 గంటలకు ప్రారంభించనున్నారు. అనంతరం తాటిపర్తిపాళెం సమీపంలోని నందగోకులం పాఠశాల, గోశాలను సందర్శించనున్నారు. సీఎం పర్యటించనున్న ప్రాంతాల్లో ఏర్పాట్లను అధికారులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేశారు.

నేటి నుంచి ఎన్టీఆర్ వైద్యసేవల నిలిపివేత

నెల్లూరు(అర్బన్): నిధులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో నెట్‌వర్క్ ఆస్పత్రులకు పెనుభారంగా మారిందని, ఈ తరుణంలో ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ)లను శుక్రవారం నుంచి నిలిపేయనున్నామని ఆంధ్రప్రదేశ్ స్పెషాల్టీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్, అరవింద్ కిడ్నీ ఆస్పత్రి అధినేత డాక్టర్ నారాయణరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నెట్‌వర్క్ ఆస్పత్రులకు రూ.2700 కోట్లకుపైగా బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని చెప్పారు. సంఘం తరఫున వినతిపత్రాలను అందించినా స్పందన కరువైందని ఆరోపించారు.

సంతపేట ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్

నెల్లూరు(క్రైమ్): సంతపేట ఇన్‌స్పెక్టర్ దశరథ రామారావును సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి బుధవారం రాత్రి జారీ చేశారు. పెన్నా బ్యారేజీ సమీపంలో సోమవారం అర్ధరాత్రి జరిగిన జంట హత్యల ఘటనకు బాధ్యుడ్ని చేస్తూ సస్పెన్షన్ వేటేశారు. ఇన్‌చార్జిగా చిన్నబజార్ ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావును నియమించారు.

ఇండస్ట్రియల్ హబ్‌గా కరేడు

నెల్లూరు రూరల్: పోర్టు ఆధారిత పరిశ్రమలతో కరేడు గ్రామ రూపురేఖలు పూర్తిగా మారిపోతున్నాయని, ఇక్కడ ఇండస్ట్రియల్ హబ్ ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ హిమాన్షు శుక్లా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 4800 ఎకరాలు అవసరం కాగా, ఇప్పటి వరకు 515 ఎకరాలకు సంబంధించిన రైతులకు పరిహారాన్ని మంజూరు చేశామని వివరించారు. పరిశ్రమల ఏర్పాటుతో వేలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయని చెప్పారు. భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం న్యాయమైన పరిహారాన్ని అందిస్తోందని పేర్కొన్నారు.

శ్రీవారి దర్శనానికి 24 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ గురువారం ఎక్కువగా ఉంది. క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ నిండిపోయాయి. భక్తుల క్యూ శిలాతోరణం వద్దకు చేరుకుంది. స్వామివారిని 74,861 మంది భక్తులు బుధవారం అర్ధరాత్రి వరకు దర్శించుకున్నారు. తలనీలాలను 31,802 మంది అర్పించారు. కానుకల రూపంలో హుండీలో రూ.3.93 కోట్లను సమర్పించారు. టైమ్ స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలోనే దర్శనం లభిస్తోంది. టికెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లోనే దర్శనం లభిస్తోంది.

మాస్టారుది పెద్ద స్కెచ్చే

మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ ఎత్తుగడ

- తన అనుయాయులకు కట్టబెట్టేందుకే స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్
- మైపాడు రోడ్డును ఆక్రమించి దుకాణాల ఏర్పాటు
- నేడు ప్రారంభించాల్సి ఉన్నా చివరి నిమిషంలో వాయిదా

చిరు వ్యాపారుల పొట్టగొట్టి తన అనుయాయులకు లబ్ధి చేకూర్చేలా మంత్రి నారాయణ అడుగులేస్తున్నారు. అనుకున్నదే తడవుగా మైపాడు గేట్ సెంటర్‌లో స్మార్ట్ స్ట్రీట్ పేరుతో కంటైనర్లలో దుకాణాలను ఏర్పాటు చేశారు. స్ట్రీట్ వెండింగ్ పేరుతో మున్సిపల్ నిధులతో అన్ని సౌకర్యాలను కల్పించి షాపులను అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు. దీనికి గానూ తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నెల్లూరు నగరాన్ని తొలి దశలో ఎంచుకున్నారు. ప్లగ్ అండ్ ప్లే విధానంలో వీటిని వ్యాపారులకు అప్పగిస్తామని చెప్తున్నా, టీడీపీ వారికే ఇచ్చేలా చర్యలు చేపడుతున్నారు. ఆయన కలలను సీఎం చంద్రబాబు సాకారం చేస్తూ.. దీన్ని శుక్రవారం ప్రారంభించాల్సి ఉన్నా, వాయిదా పడింది.

సాక్షి ప్రతినిధి,నెల్లూరు: నగరాభివృద్ధిని విస్మరిస్తూ.. చిరు వ్యాపారుల పొట్టగొట్టి.. తమ్ముళ్ల జేబులు నింపుతూ.. కొత్త పథకాలతో తమ వారికి ఉపాధి కల్పించడంలో మంత్రి నారాయణ నూతన పోకడలను అవలంబిస్తున్నారు. దీనికి చక్కటి ఉదాహరణగా మైపాడు గేట్ సెంటర్‌లోని స్మార్ట్ స్ట్రీట్ నిలుస్తోంది. ఇంటికి అవసరమైన వస్తువులు ఒకే చోట లభించేలా.. వినియోగదారుల సౌలభ్యం కోసమంటూ దీన్ని తెరపైకి తెచ్చారు. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో ఈ వ్యాపార సముదాయాలను మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో అప్పగించే యత్నాలను ప్రారంభించారు.

చిరు వ్యాపారులను చిదిమేస్తూ..

వాస్తవానికి నగరాల్లో వీధి వ్యాపారులు ఫుట్‌పాత్‌లపైనే బిజినెస్‌ను సాగిస్తుంటారు. అయితే వీరి పొట్టగొట్టేందుకు స్కెచ్ వేశారు. స్ట్రీట్ వెండింగ్ పేరుతో మున్సిపల్ నిధులతో అన్ని సౌకర్యాలను కల్పించి షాపులను అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు. ప్లగ్ అండ్ ప్లే విధానంలో వీటిని వ్యాపారులకు అప్పగిస్తామని చెప్తున్నా, అందుకు భిన్నంగా జరుగుతోంది.

తమ్ముళ్ల కళ్లలో ఆనందం కోసం..

గత ఎన్నికల్లో నెల్లూరు నగర నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా నారాయణ గెలుపొందారు. ఆ సమయంలో ఓ టీమ్‌ను ఏర్పాటు చేసి మూడు నెలల పాటు జీతాలిచ్చారు. డివిజన్ల వారీగా వారితో ఎన్నికల పనులు చేయించుకున్నారు. అధికారంలోకి వస్తే తప్పకుండా జీవనోపాధి కల్పిస్తామంటూ వారికి హామీనీ ఇచ్చారని టాక్. ఇంకేముంది పురపాలక మంత్రిగా బాధ్యతలను స్వీకరించాక స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్‌ను తెరపైకి తెచ్చారు. నెల్లూరులోనే అయితే చెడ్డ పేరొస్తుందని భావించి.. రాష్ట్రవ్యాప్తంగా అన్ని మున్సిపాల్టీల్లో అమలు చేసేందుకు యత్నించారు. టీడీపీ నేతలిచ్చిన జాబితా మేరకే దుకాణాలను కేటాయించేలా అధికారులను ఆదేశించారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసేవారు ఖాళీ చేయాలంటూ కమిషనర్ ద్వారా హెచ్చరికలూ జారీ చేయించారు.



స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ కోసం మైపాడు రోడ్డులో ఏర్పాటు చేసిన కంటైనర్లు

బతుకుదెరువెలా..?

ప్రధాన నగరాల్లో స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ఏర్పాటైతే వేలాది మంది చిరు వ్యాపారులు రోడ్డునపడే అవకాశం ఉంది. ఒక్క నెల్లూరులోనే ఫుట్‌పాత్‌లపై నాలుగు వేల మంది బిజినెస్ చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. ఈ తరుణంలో తమ పరిస్థితి ఏమిటాననే ఆందోళన వీరిలో వ్యక్తమవుతోంది.

నాడు విస్తరిస్తే.. నేడు ఆక్రమిస్తున్నారు..!

వాస్తవానికి నగరంలోని పాత చెక్‌పోస్ట్ నుంచి వేణుగోపాల్‌నగర్ (చేపల మార్కెట్) వరకు మైపాడు రోడ్డును దాదాపు 2.7 కిలోమీటర్ల మేర రూ.20 కోట్లను వెచ్చించి.. 60 అడుగుల వరకు నాలుగు వరుసల రహదారిగా గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో విస్తరించారు. ఈ దారిలో నిత్యం దాదాపు 15 వేల వాహనాల రాకపోకలు సాగిస్తుంటాయి. సిమెంట్ రోడ్లు, డివైడర్లలో పచ్చదనం, సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేసి సర్వాంగసుందరంగా తీర్చిదిద్దారు. రహదారికి ఇరువైపులా వాకింగ్ ట్రాక్, పార్కుల ఏర్పాటుకు ప్రణాళికలనూ సిద్ధం చేశారు. ఈ తరుణంలో ఎన్నికలు రావడంతో వీటికి బ్రేకులు పడ్డాయి. ప్రస్తుతం రహదారికి ఇరువైపులా స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ పేరుతో 30 కంటైనర్లను పెట్టించి 120 మంది తెలుగు మహిళలకు మంత్రి నారాయణ అప్పగించారు.

సమర్పయామీ..

నెల్లూరులో స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ తెలుగు మహిళలకు లాభసాటిగా మారింది. ఒక్కో దుకాణానికి రూ.నాలుగు లక్షలను కేటాయించనున్నామని మంత్రి తెలిపారు. ఇందులో మెప్మా, కార్పొరేషన్ నుంచి రూ.రెండు లక్షలు.. మరో రూ.రెండు లక్షల రుణ సదుపాయాన్ని కల్పించనున్నారు. మొత్తమ్మీద ఎన్నికల్లో పనిచేసిన వారికి రూ.8.4 కోట్లను వెచ్చించారు.

ఎన్జీటీ నిబంధనలు బేఖాతర్

స్మార్ట్ స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ ఏర్పాటుకు కొన్ని నిబంధనలను అమలు చేయాలని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశించినా.. మంత్రి, నగరపాలక సంస్థ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఈ అంశంపై ఎన్జీటీ దృష్టికి ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తీసుకెళ్లడంతో నిబంధనలు పాటించాలని ఆదేశాలు జారీ చేసింది. పేరుకుపోయే చెత్త పక్కనే ఉన్న కాలువలో చేరి నీరు కలుషితమవుతుందని.. కాలువ పోరంబోకు స్థలాలు ఆక్రమణకు గురవుతాయనే వాదనతో ఏకీభవించింది. దీంతో పనులను తాత్కాలికంగా నిలిపేసి, నిబంధనలు పాటించాకే ప్రారంభించాలని పేర్కొంది. భూగర్భ డ్రైనేజీని పూర్తి చేసి కాలువకు కంచె వేస్తే, ఆ తర్వాతే షాపుల ఏర్పాటుకు అనుమతిస్తామని తెలిపింది. మరోవైపు ఈ పనులు పూర్తి కావాలంటే మరో పదేళ్లు పట్టే అవకాశం ఉంది. దీంతో ఎన్జీటీ మార్గదర్శకాలను పాటించకుండానే స్ట్రీట్ వెండింగ్‌ను హడావుడిగా ప్రారంభించేందుకు అధికారులు చర్యలు చేపడుతుండటం గమనార్హం.

లైట్స్.. కెమెరా.. యాక్షన్

- బాబొస్తున్నారు.. సుందరంగా మార్చండి
- మంత్రి నారాయణ ఆదేశాలు
- పర్యటనలో హడావుడిగా నెల్లూరును చేర్చినా .. చివరి నిమిషంలో రద్దు

నెల్లూరు సిటీ: బాబొస్తున్నారు.. దుకాణ యజమానులు సిద్ధంగా ఉండండి.. సరుకులను సిద్ధం చేయండి.. స్మార్ట్ స్ట్రీట్‌ను శుభ్రం చేసి సుందరంగా మార్చండంటూ రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశాలు జారీ చేశారు. వాస్తవానికి వెంకటాచలం మండలంలో పర్యటనకు సీఎం చంద్రబాబు శుక్రవారం రానున్నారు. ఇందులో భాగంగా తొలుత ఖరారు చేసిన రూట్‌మ్యాప్‌లో మైపాడు గేట్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన స్మార్ట్ స్ట్రీట్ ప్రారంభోత్సవమే లేదు. అయితే బుధవారం సాయంత్రానికి దీన్ని మంత్రి ఖరారు చేశారు. మరోవైపు దుకాణ నిర్వాహకులు, ఆ ప్రాంతం ప్రారంభానికి సిద్ధంగా లేదు. ఈ తరుణంలో మంత్రి హడావుడిగా నెల్లూరు చేరుకొని ఆదేశాలు జారీ చేశారు. అయితే చివరి నిమిషంలో పర్యటన రద్దవడంతో ఈ ప్రయాస వృథా అయింది.

హడావుడిగా శుభ్రం

మైపాడు గేట్ సెంటర్‌లోని స్మార్ట్ స్ట్రీట్ దుకాణాల వెనుక వైపు కాలువ మురికి కూపంలా మారింది. మురుగు నిలిచిపోయి తీవ్ర దుర్గంధం వచ్చేది. అయితే హడావుడిగా శుభ్రపర్చే యత్నాలను అధికారులు ప్రారంభించారు. అయినా అదే పరిస్థితి నెలకొంది. ఆయా దుకాణాల్లో ఫుడ్ కోర్టులున్న తరుణంలో తామక్కడ ఆహారాన్ని ఎలా తీసుకోగలమని పలువురు ప్రశ్నిస్తున్నారు.

అప్పటికప్పుడు చెట్లు ప్రత్యక్షం

మైపాడు గేట్ సెంటర్‌లోని డివైడర్ల మధ్యలో అప్పటికప్పుడు చెట్లు గురువారం మొలిచాయి. ట్రాక్టర్లలో తీసుకొచ్చి నాటడం స్థానికులను ఆశ్చర్యానికి గురిచేసింది. నిన్నామొన్నటి వరకు దుమ్ము, ధూళిలో ఉన్న ప్రాంతం ఒక్కసారిగా సుందరవనంగా మారిపోయింది. ఈ శ్రద్ధ రోజూ ఉంటే ఎంతో బాగుండేదనే అభిప్రాయం స్థానికుల్లో వ్యక్తమవుతోంది.

అక్కడ నో.. ఇక్కడ మాత్రం సై..!

నగరంలో హత్యలు, చోరీలు నానాటికీ ఎక్కువవుతున్నాయి. వీటిని కట్టడి చేసేందుకు.. నిందితులను త్వరితగతిన పట్టుకునే అంశంలో సీసీ కెమెరాలు కీలకపాత్ర పోషిస్తాయి. ఎన్నో చోట్ల ఇవి పనిచేయకపోయినా, వాటిని బాగుచేసే దిశగా చొరవ చూపని పాలకులు.. స్మార్ట్ స్ట్రీట్‌లో మాత్రం అన్ని దుకాణాలకు ఏర్పాటు చేయడం గమనార్హం.



స్ట్రీట్ వెండింగ్ మార్కెట్ వెనుక ఇదండీ దుస్థితి

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై పోరాటం ఆగదు

- సంక్షేమ పథకాల అమలు అస్తవ్యస్తం
- ధ్వజమెత్తిన కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు(పొదలకూరు): మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై పోరాటాన్ని తమ పార్టీ కొనసాగించనుందని, సంక్షేమ పథకాలు పేదలకు అందేంత వరకు ఉద్యమాలను చేస్తూనే ఉంటామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. ముత్తుకూరులోని పార్టీ కార్యాలయంలో పార్టీ నేతలు, కార్యకర్తలతో గురువారం నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారెంటీ అంటూ ప్రచారం చేసిన టీడీపీ శ్రేణులు ఇప్పుడు ప్రజలకు ముఖం చూపలేకపోతున్నారని విమర్శించారు. సంక్షేమ పథకాలను తొలి ఏడాది ఎగ్గొట్టి.. తర్వాతి ఏడాది అరకొరగా అమలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. సర్వీసులను పెంచకుండా ఉచిత బస్సుల పేరిట ప్రజలకు నరకం చూపుతున్నారని చెప్పారు. నాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన 17 మెడికల్ కళాశాలల్లో పదింటిని విక్రయించేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారని మండిపడ్డారు. దీన్ని వ్యతిరేకిస్తూ శుక్రవారం నుంచి నవంబర్ 22 వరకు కోటి సంతకాలను సేకరించనున్నామని వెల్లడించారు.

కల్తీ మద్యంపై సోమిరెడ్డి వ్యాఖ్యలు హాస్యాస్పదం

కల్తీ మద్యం మూలాలు కూటమి ప్రభుత్వంలో బయటపడుతుంటే.. తమపై బురదజల్లేందుకు సోమిరెడ్డి యత్నించడం దారుణంగా ఉందని కాకాణి విమర్శించారు. ఆయనకు డబ్బులిస్తే దేనికైనా సై అంటారని, గతంలో తనపై మోపిన కల్తీ మద్యం కేసుపై సీబీఐ విచారణ వేయించేందుకు సిద్ధమానని ప్రశ్నించారు. అప్పట్లో సీఎంగా ఉన్న చంద్రబాబును ఇదే విషయమై అసెంబ్లీలో తాను కోరానని గుర్తుచేశారు. కల్తీ మద్యం బయటపడిన కేసులో కూటమి నేతలే ప్రధాన సూత్రధారులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు, లోకేశ్‌కు అత్యంత సన్నిహితులే ప్రధాన పాత్రను పోషించారన్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో కూటమి నేతలు కల్తీ మద్యాన్ని విక్రయిస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వీటిపై విచారణ జరిపిస్తామని తెలిపారు. కృష్ణపట్నంలో టెర్మినల్‌ను తెప్పిస్తానన్న సోమిరెడ్డి ఎంత దూరం తీసుకొచ్చారో ప్రజలకు చెప్పాలని ప్రశ్నించారు. పార్టీ మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, నెల్లూరు శివప్రసాద్, ఎంపీపీ గండవరపు సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి

పారా లీగల్ వలంటీర్ల పాత్ర కీలకం

నెల్లూరు (లీగల్): పారా లీగల్ వలంటీర్ల పాత్ర కీలకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ పేర్కొన్నారు. ఏపీ హైకోర్టు ఆదేశాల మేరకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కోర్టు ఆవరణలోని న్యాయసేవా సదన్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలు.. ప్రభుత్వ సంస్థలకు వారధిగా ఉంటూ బాధ్యతతో మెలగాలని పేర్కొన్నారు. న్యాయసేవ విధులు, పలు చట్టాలపై అవగాహన కల్పించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వాణి, లోక్‌అదాలత్ ప్యానల్ న్యాయవాదులు టంగుటూరి గోపాల్‌రెడ్డి, కోటేశ్వరరావు, లక్ష్మీప్రసాద్, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్ తదితరులు

అటవీ ప్రాంతంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు

సీతారామపురం: మండలంలోని పంద్రంగి బీట్ అటవీ ప్రాంతాన్ని గుంటూరు ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం గురువారం తనిఖీ చేసింది. ఈ సందర్భంగా స్క్వాడ్ బృంద ఎఫ్ఆర్వో సుబ్బారావు మాట్లాడారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై అటవీ శాఖ సిబ్బంది డేగకన్ను వేయాలని సూచించారు. అడవుల సంరక్షణపై అంకిత భావంతో పనిచేయాలని కోరారు. అటవీ సంపదను ఎవరైనా అక్రమంగా నరికి తరలిస్తున్నారనే అంశాలపై క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. డీఆర్వో ప్రసాద్, ఎఫ్ఎస్వో అశోక్, ఎఫ్బీఓలు గౌతమ్, సాయి, ప్రసాద్, రమణ తదితరులు పాల్గొన్నారు.



వర్షంతో రైతులకు నష్టం



తడిచిన ధాన్యం

సోమశిల: వర్షంతో అనంతసాగరం మండల రైతులు తీవ్రంగా నష్టపోయారు. మండలంలో వరి కోతలు వారం రోజులుగా ముమ్మరంగా సాగుతున్నాయి. ధాన్యాన్ని కల్లాల్లో నిల్వ చేసి విక్రయాలు నిమిత్తం ఎదురుచూస్తుండగా, ఈదురుగాలులతో కురిసిన వర్షానికి తడిచిముద్దయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో ఉన్న వరి వాలిపోయింది. కోసిన ధాన్యాన్ని వరికోత యంత్రాలతో గట్లకు చేర్చేందుకు అదనపు సమయం పడుతుందని వాపోతున్నారు.

డీసీపల్లిలో 713 పొగాకు బేళ్ల విక్రయం

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో 713 బేళ్లను గురువారం విక్రయించారని నిర్వహణాధికారి రాజశేఖర్ తెలిపారు. 922 బేళ్లు రాగా, 713ను విక్రయించగా, మిగిలిన వాటిని వివిధ కారణాలతో తిరస్కరించారని చెప్పారు. 86,998.9 కిలోల పొగాకును విక్రయించగా, రూ.1,65,56,808.50 వ్యాపారం జరిగిందని వివరించారు. గరిష్ట ధర కిలో రూ.315.. కనిష్ట ధర రూ.70.. సగటు ధర రూ.190.31గా నమోదైందని పేర్కొన్నారు. 11 కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారన్నారు.



6. 7 కిలోల గంజాయి స్వాధీనం

నెల్లూరు(క్రైమ్): గంజాయిని చిన్న ప్యాకెట్లుగా చేసి గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న ఇద్దరు నిందితులను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. నెల్లూరు నగర పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అనిత తన సిబ్బందితో కలిసి దాడులను గురువారం చేపట్టారు. నారాయణ వైద్యకళాశాల సమీపంలో రామును అదుపులోకి తీసుకొని అతని నుంచి 700 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రాము సమాచారం మేరకు సమీప కాలనీలో ఉంటున్న దండుమారిని అదుపులోకి తీసుకొని ఇంట్లో సోదాలు చేశారు. ఆరు కిలోల గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యాలయానికి వీరిని తరలించి తమదైన శైలిలో విచారించారు. సూళ్లూరుపేటకు చెందిన ప్రసాద్ నుంచి గంజాయిని కొనుగోలు చేసి చిన్న ప్యాకెట్లుగా చేసి విక్రయిస్తున్నామని నిందితులు చెప్పారు. వీరితో పాటు స్వాధీనం చేసుకున్న గంజాయిని తదుపరి విచారణ నిమిత్తం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ నెల్లూరు - 1 స్టేషన్లో అప్పగించారు. ఒడిశా నుంచి తీసుకొచ్చి జిల్లాలోని పలువురికి ప్రసాద్ విక్రయిస్తున్నారని అధికారులు తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు పూర్ణకుమార్, కాలేషావలీ, హెడ్ కానిస్టేబుళ్లు ప్రసాద్, రమేష్‌కుమార్, కానిస్టేబుళ్లు మునిరాజ్‌కుమార్, గిరిబాబు, రమణయ్య పాల్గొన్నారు.



విక్రేతలతో ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

క్లుప్తంగా

మినీ ట్రక్కు ఢీకొని..

• ఉద్యాన శాఖ విస్తరణాధికారిణి మృతి



ప్రియాంక మృతదేహం

నెల్లూరు(క్రైమ్): జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఉద్యాన విస్తరణాధికారిణి మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నవాబుపేట కృష్ణానగర్‌లో డి.ప్రియాంక (34), బాలవిశ్వనాథ్ దంపతులు నివాసముంటున్నారు. ప్రియాంక కోవూరులో ఉద్యాన విస్తరణాధికారిణిగా పనిచేస్తున్నారు. గురువారం సాయంత్రం ఆమె వేదాయపాళెం లోని ఆ శాఖ జిల్లా కార్యాలయానికి స్కూటీపై బయలుదేరారు. సౌత్‌రాజుపాళెం జంక్షన్ వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి మినీ ట్రక్కు స్కూటీని వేగంగా ఢీకొంది. గాయాలపాలైన ఆమెను స్థానికులు సమీపంలోని మెడికవర్ హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే ప్రియాంక మృతిచెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు నార్త్ ట్రాఫిక్ పోలీసులకు సమాచారం అందింది. వారు హాస్పిటల్‌కు చేరుకుని మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

రెండు పెట్రోలు పంపుల సీజ్



డీజిల్ పంపును తనిఖీ చేస్తున్న అధికారులు

పొదలకూరు: పట్టణంలోని సంగం రోడ్డు సెంటర్‌లో ఉన్న దామోదరం పెట్రోలు బంక్‌లో గురువారం లీగల్ మెట్రాలజీ శాఖ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించి రెండు పంపులను సీజ్ చేశారు. ఈ సందర్భంగా మూడు జిల్లాల లీగల్ మెట్రాలజీ అధికారి ఐజాక్ మాట్లాడుతూ పెట్రోలు బంక్‌లో కొలతలు తేడా ఉన్నట్టు వెల్లడించారు. 5 లీటర్ల పెట్రోలు, డీజిల్ పట్టుకుంటే 100 ఎంఎల్ నుంచి 140 ఎంఎల్ తేడా చూపుతున్నట్టు పేర్కొన్నారు. తనిఖీల్లో జిల్లా లీగల్ మెట్రాలజీ అధికారి రియాజ్‌బాషా, ఏఎస్ఓ అంకయ్య, సివిల్ సప్లయ్స్ డీటీ ఐ.రవి పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్:	రూ.118
లేయర్	రూ.122
బ్రాయిలర్ చికెన్:	రూ.214
స్కిన్‌లెస్ చికెన్:	రూ.236
లేయర్ చికెన్:	రూ.207



మానసిక ఆరోగ్యం.. అవగాహన కీలకం

• నిర్లక్ష్యం చేస్తే మతిస్థిమితం కోల్పోవడం ఖాయం
• రోజూ వైద్యం కోసం వెళ్తున్న మూడు వేలమంది
• ఒత్తిడి, అవహేళనతో కుంగుబాటు
• ప్రాథమిక దశలో చికిత్సతో సాధారణ జీవితం

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం



జిల్లాలో ఇలా..

జిల్లాలో రోజూ సుమారు 15 వేల మంది వరకు ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో మూడు వేల మంది రోగులు మానసిక సమస్యలతో డాక్టర్ల వద్దకు వైద్యం కోసం వెళ్తున్నారు. గతంలో నెల్లూరులో కేవలం ఇద్దరు మానసిక వైద్య నిపుణులుండగా ఇప్పుడు పదిమంది వరకు చికిత్స అందిస్తున్నారు. అలాగే ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో ప్రత్యేకంగా పలువురు మానసిక వైద్య నిపుణులతో విభాగం ఉంది.

నెల్లూరు(అర్బన్): మనిషి సంపూర్ణ ఆరోగ్యంగా ఉన్నప్పుడే ఏదైనా సాధిస్తాడు. శారీరక ఆరోగ్యమే కాదు. మానసిక ఆరోగ్యం కూడా చాలా ముఖ్యమే. చదువు పేరుతో విద్యార్థుల్లో విపరీతమైన ఒత్తిడి పెంచడం, ఉద్యోగులను టార్గెట్‌ల పేరుతో వేధించడం, స్త్రీలకు పిల్లలు సకాలంలో పుట్టకపోతే తక్కువ చేసి చూడటం, కొన్ని శారీరక అనారోగ్యాలు, సామాజికంగా తక్కువ చేసి చూడటం.. ఇవన్నీ మనిషి మెదడుపై ప్రభావాన్ని చూపుతున్నాయి. ఏమి చేయలేమనే ఆత్మన్యూనత భావంతో అనేకమంది మానసిక రోగులుగా మారుతున్నారు. వీరికి సకాలంలో కౌన్సెలింగ్ ఇచ్చి ప్రాథమిక దశలోనే వైద్య చికిత్స చేస్తే కోలుకుంటారు. లేకుంటే జీవితం నరకప్రాయంగా మారుతుంది. కొన్ని సందర్భాల్లో మతిస్థిమితం కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ 1992 నుంచి అక్టోబర్ 10వ తేదీని ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంగా నిర్వహిస్తోంది.

మానసిక ఒత్తిడే ప్రధాన కారణం

హడావుడి జీవితం, ఒత్తిడితో బతకడం నేటి సమాజంలో మామూలైంది. ఉమ్మడి కుటుంబాలు చిన్నాభిన్నమై, సమస్య వచ్చినప్పుడు సరిదిద్దే పెద్దలు లేకపోవడంతో చిన్న విషయాలకు కూడా ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. విద్యార్థి దశ నుంచే పోటీతత్వం పెరిగిపోయింది. ర్యాంక్‌ల పేరుతో ఇంట్లో తల్లిదండ్రులు, విద్యాలయాల్లో అధ్యాపకులు తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారు. ఆటపాటలు, ఆనందాల్లేవు. చదువు.. చదువు అంటూ ప్రాణాలు తోడేస్తున్నారు. ఇటీవల వనంతోపు సెంటర్‌లో ఓ కళాశాలలో రెండు నెలల్లోనే ఇద్దరు విద్యార్థులు హాస్టల్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. అలాగే ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ తొలి సంవత్సరం విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డారు. మరో ప్రైవేట్ మెడికల్ కళాశాలలోనూ ఇలాగే జరిగింది. సామాజికంగా చిన్నచూపు చూస్తూ ఇబ్బంది పెట్టిన ఘటనలో కొందరు మానసిక సమస్యలకు గురవుతున్నారు. ఇలాంటివి జరగకుండా ఉండాలంటే కౌన్సెలింగ్ తప్పనిసరి. స్వచ్ఛంద సంస్థల సభ్యులు, రాజకీయ నాయకులు, సామాజిక కార్యకర్తలు, డాక్టర్లు యువతతో పాటు ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది.

చికిత్స అందిస్తే కోలుకుంటారు



సమాజంలో మానసిక సమస్యలున్న వారి సంఖ్య పెరగడం బాధాకరం. ఇలాంటి వారికి ప్రాథమిక లక్షణాలున్నప్పుడే గుర్తించి తగిన చికిత్స అందిస్తే కోలుకుంటారు. చికిత్సతోపాటు ఒత్తిడిని జయించేలా కౌన్సెలింగ్ ఇప్పించాలి. లేకుంటే చిన్న సమస్యలకే కోపం, ఆత్మన్యూనత, ఆత్మహత్య లాంటి ఆలోచనలు వస్తాయి. ఇలాంటి వారికి హిప్నో థెరపీ, బిహేవియర్ థెరపీ, సైకో థెరపీ చికిత్సలు అవసరం. ప్రస్తుతం ఇతర శారీరక అనారోగ్యాలకు చికిత్స అందిస్తున్నట్టుగానే మానసిక జబ్బులకు చికిత్స అందిస్తున్నాం. – **డాక్టర్ లక్ష్మీప్రసూన, మానసిక వైద్య విభాగం హెచ్ఓడీ, సర్వజన ఆస్పత్రి, నెల్లూరు**

ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలి



నెల్లూరులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మానసిక దివ్యాంగులకు, మానసిక సమస్యలున్న వారికి ప్రత్యేక విభాగం ఉంది. డాక్టర్లున్నారు. మందులు అందుబాటులో ఉన్నాయి. అందువల్ల మానసికంగా బాధపడేవారు ప్రభుత్వ పరంగా అందించే ఉచిత చికిత్సను సద్వినియోగం చేసుకోవాలి. ఆరోగ్యవంతులుగా మారాలి.
– **డాక్టర్ కొండేటి మాధవి, సూపరింటెండెంట్, సర్వజన ఆస్పత్రి, నెల్లూరు**

వ్యవసాయ పనులు చేస్తుండగా..

• పిడుగుపాటుకు రైతు మృతి

సోమశిల: ఓ రైతు వ్యవసాయ పనులు చేస్తుండగా పిడుగుపడి మృతిచెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. కాకినాడకు చెందిన కొవ్వూరు వెంకట రామకృష్ణారెడ్డి (59) చేజర్లలో పొలం కొనుగోలు చేసి కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తున్నాడు. కుటుంబంతో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో పొలంలో పనులు చేస్తుండగా ఒక్కసారిగా ఈదురుగాలులతో కూడిన వర్షం మొదలైంది. పిడుగు పడటంతో రామకృష్ణారెడ్డి కుప్పకూలి చనిపోయాడు.

చూపు కోల్పోయిన గిరిజనుడు

మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలు తూర్పుడొంక పొలాల్లో బుధవారం పిడుగు పడటంతో ఓ వ్యక్తి చూపు కోల్పోయాడు. వివరాలు.. తూర్పుడొంకలోని కట్ట మీద నివాసముంటున్న శనగా శీనయ్య రాత్రి సమయంలో పిడుగు పడటాన్ని దగ్గర నుంచి చూశాడు. దీంతో కుడికన్ను చూపు కోల్పోయినట్లు చెప్పాడు. విషయం తెలుసుకున్న మనుబోలు వీఆర్వో నాగార్జునరెడ్డి గురువారం శీనయ్యను పరామర్శించారు.

28న కోవూరులో భారీ ప్రదర్శన

• నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి



నాయకులతో మాట్లాడుతున్న ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు: 'ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై పోరాటం చేస్తాం. ఈనెల 28వ తేదీన కోవూరులో భారీ ప్రదర్శన జరుగుతుంది' అని మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి తెలిపారు. వైఎస్సార్‌సీపీ కోవూరు నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం గురువారం నెల్లూరులోని ప్రసన్న నివాసంలో జరిగింది. దీనికి కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల కన్వీనర్లు, సీనియర్ నాయకులు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ స్థాయి పదవుల్లో ఉన్న వారు హాజరయ్యారు. ప్రభుత్వ నిర్ణయాలు, ప్రజా సమస్యలు, రాబోయే కార్యక్రమాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా నల్లపరెడ్డి మాట్లాడుతూ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రం అభివృద్ధి చెందినట్లు చెప్పారు. పేదలు, మధ్య తరగతి కుటుంబాల కోసం విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేసి వైద్య విద్యను సామాన్యులకు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఆ కాలేజీలను ప్రైవేట్‌పరం చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించిందన్నారు. పేదలకు వ్యతిరేకంగా తీసుకున్న ఈ నిర్ణయాన్ని వైఎస్సార్‌సీపీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదన్నారు. ప్రజలు, విద్యార్థులు, భవిష్యత్ తరాల కోసం రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం ముమ్మరం చేస్తామన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక పేదలకు ఆనందం కరువైందన్నారు. ప్రజా సంక్షేమ పథకాలు నిలిచిపోయాయని చెప్పారు. ప్రజలకు ఉపాధి, భద్రత లభించడం లేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కూటమి ప్రభుత్వం చెరిపేయాలని ప్రయత్నిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 28వ తేదీన కోవూరు మండలంలో చేపట్టే భారీ ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రజల్లో చైతన్యం కల్పించాలన్నారు.

నేటి నుంచి బోధనేతర పనుల బహిష్కరణ

నెల్లూరు(టౌన్): శుక్రవారం నుంచి ఉపాధ్యాయులు బోధనేతర పనులను బహిష్కరిస్తున్నట్లు ఫ్యాప్టో చైర్మన్ మధుసూదనరావు తెలిపారు. గురువారం నెల్లూరులో జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో డీఈఓ బాలాజీరావును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధనేతర పనులపై పలుమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినా ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. పోరుబాట కార్యక్రమంలో ఈనెల 10వ తేదీ నుంచి బోధనేతర పనులను బహిష్కరించాలని ఫ్యాప్టో నిర్ణయించిందన్నారు. విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించిన పనులు మాత్రమే ఉపాధ్యాయులు చేపడతారన్నారు. మూల్యాంకనానికి సంబంధించి పరీక్షల నిర్వహణ తప్ప ఏ బోధనేతర పని, గూగుల్ షీట్స్ నింపడం గానీ, విద్యాశక్తి, జీఎస్టీ 2.0 లాంటి సీజనల్ ప్రచార కార్యక్రమాలను చేపట్టబోమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కండలేరులో 59.206 టీఎంసీలు



రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 59.206 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3,400 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. ఇక్కడి నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,200, పిన్నేరు కాలువకు 80, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 150, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.25
పండ్లు : రూ.15



సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు



మాట్లాడుతున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైమ్): సీఎం చంద్రబాబు శుక్రవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎస్పీ అజిత 1,250 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్పీ గురువారం నెల్లూరులోని జిల్లా పోలీస్ కార్యాలయంలో బందోబస్తు విధులకు హాజరైన పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాలను నిర్దేశిత పార్కింగ్ ప్రాంతాల్లోనే నిలిపేలా చూడాలన్నారు. ప్రధాన కూడళ్లలో మూవబుల్ బ్యారికేడ్లను ఏర్పాటు చేయాలన్నారు. సీఎం పర్యటించే ప్రాంతాల్లో డాగ్ స్క్వాడ్, బాంబ్ స్క్వాడ్‌లతో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించాలన్నారు. వీవీఐపీ వెళ్లే మార్గంలో వ్యతిరేక దిశలో వాహనాల కదలికల్ని పూర్తిగా నిరోధించాలన్నారు. అనంతరం ఆమె సీఎం పర్యటించే ప్రాంతాల్లో ట్రయల్ కాన్వాయ్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, డీఎస్పీలు, ఇన్‌స్పెక్టర్‌లు, ఆర్ఐలు పాల్గొన్నారు.

రైలు ఢీకొని వ్యక్తి దుర్మరణం

నెల్లూరు(క్రైమ్): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నెల్లూరు సౌత్ రైల్వే స్టేషన్ సమీపంలో చెన్నై వైపు వెళ్లే రైలు పట్టాలపై గురువారం చోటుచేసుకుంది. మృతుడి వయసు 55 నుంచి 60 ఏళ్ల లోపు ఉండొచ్చని భావిస్తున్నారు. గోధుమ రంగు ఫుల్ హ్యాండ్స్ చొక్కా, నలుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నారు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న రైల్వే ఎస్సై ఎస్.హరిచందన ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించి ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వేట సాగక.. పూట గడవక..



కోడూరు తీరంలో పడవలు

తోటపల్లిగూడూరు: మండలంలోని తీర ప్రాంతంలో ఉన్న మత్స్యకారులకు ఇబ్బందుల్లో ఉన్నారు. కోడూరు పంచాయతీలోని 8 మత్స్యకార గ్రామాలతోపాటు వెంకన్నపాళెం పట్టపుపాళెంలోని సుమారు 3 వేల మంది వేటపై ఆధారపడి జీవిస్తున్నారు. కొంత కాలంగా వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో సముద్రంలోని మత్స్య సంపద దరికి చేరడం లేదు. దీంతో ఇప్పటి వరకు అంతంతమాత్రంగా సాగుతున్న వేట పూర్తిగా నిలిచిపోయే పరిస్థితి ఏర్పడింది. తీరంలో అలలు ఎగసిపడుతున్నాయి. పోటు కారణంగా సముద్రం కాస్త ఉగ్రరూపంగా మారుతోంది. దీంతో వేటకు వెళ్లేందుకు మత్స్యకారులు భయపడుతున్నారు. ఒకవేళ ధైర్యం చేసి వెళ్లినా చేపలు లభ్యం కాక ఖాళీ పడవులతో తిరిగి రావాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో అనేకమంది తమ వేట సామగ్రి, పడవులను తీరంలో కట్టేసి ఇతర పనులను చూసుకుంటున్నారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.